సత్తాచూపిన తెనాలి ఇంటర్ విద్యార్థులు



టాపర్లుగా నిలిచిన ఫరీదా, క్రిష్ణప్రియ, గురులావణ్య, మిష్బా, లిఖితలకు అభినందనందిస్తున్న దృశ్యం

తెనాలి: ఇంటర్ పరీక్షల్లో స్థానిక వివేక విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సర ఫలితాల్లో వివేక విద్యార్థులు అగ్రగామి మార్కులను సాధించటం విశేషం. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో షేక్ ఫరీదా 989/1000 మార్కులు సాధించగా, జూనియర్ ఇంటర్ విద్యార్థిని క్రిష్ణప్రియ 467/470 మార్కులతో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను స్థానిక వివేక మహిళా జూనియర్ కాలేజీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సభలో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అధ్యక్షత వహించిన వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ ఫరీదా, క్రిష్ణప్రియతోపాటు తమ విద్యార్థిని సీహెచ్ గురులావణ్య ఎంఈసీలో 978/1000 మార్కులు సాధించిందని చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో తమ విద్యార్థినిలు మిష్బా బైపీసీలో 430/440 మార్కులు, వై.లిఖిత ఎంఈసీలో 482/500 మార్కులు కైవసం చేసుకుందన్నారు. జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో అన్ని గ్రూపుల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధించటం గర్వకారణమన్నారు. సీనియర్ ఇంటర్‌లో తమ విద్యార్థులు 16 మంది 980 పైగా మార్కులతో, జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులతో 25 మంది విద్యార్థులు 460 పైగా మార్కులతో ఉత్తీర్ణులైనట్టు వివరించారు. గత జనవరిలో ఐఐటీ-జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థి పవన్‌కుమార్ 98.37 పర్సంటైల్ సాధించినట్టు గుర్తుచేశారు. కార్యక్రమంలో సీఈవో ఉదయ్‌కిరణ్, మహిళా కాలేజీ ప్రిన్సిపాల్స్ జ్యోతి, శ్రీనివాసరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ సునీల్‌కుమార్, కొల్లిపర కాలేజీ ట్రెజరర్ ప్రభాకరరెడ్డి, మురళి, ఠాగూర్, రాంబాబు పాల్గొన్నారు.

- వైష్ణవి జూనియర్ కళాశాల విజయదుందుభి మ్రోగించినట్లు ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు తెలిపారు. తమ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థినీ కె.రాజేశ్వరి 986, బైపీసీ విద్యార్థి జి.వెంకటలక్ష్మి, శ్రీ దుర్గా 982, జూనియర్ ఇంటర్ ఎంపీసీ కె.శిరీష, వి.జానకీరామ్ 459, బైపీసీ విభాగంలో పి.మేరిమహితా 434 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు చెప్పారు. సీనియర్ ఇంటర్‌లో 900 మార్కులు 54 మంది, జూని యర్ ఇంటర్‌లో 400 మార్కులు 47మంది సాధించినట్లు తెలిపారు. వీరిని రైల్వేస్టేషన్ రోడ్డులోని కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వీరేంద్ర, బాబు, లలిత, షంషాద్‌బేగం, మౌనిక, రోజీమేరి, నంద కిషోర్, నవీన్, ఆరోన్ పాల్గొన్నారు.
- తెనాలి పట్టణంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభ చూపారని ఏజీఎం దుర్గాప్రసాద్ తెలి పారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో జి.పూర్ణిమ 466, బైపీసీ విభాగంలో ఐ.ఫాతిమా, దీపికలు 430 మార్కులు సాధించినట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో జె.బాల వర్షిణీ 989, బైపీసీ విభాగంలో పి.భావ్య 987 మార్కులు సాధించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరంలో 460 మార్కులు 54 మంది, ద్వితీయ సంవత్సరం 980 మార్కులు 24 మంది సాధించినట్లు చెప్పారు. వీరిని కళాశాల ఆవరణలో అభినందించారు.
- ఇంటర్ పలితాల్లో శ్రీ మహితా జూనియర కాలేజ్ విద్యార్థులు విజయఢంక మ్రోగించారని ప్రిన్సిపల్స్ హరిప్రసాద్, ఎం.విద్యాసాగర్ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో డి.నేహా దుర్గా 466, డి.రూపేష్ చంద్ర 465, బైపీసీ విభాగంలో వై.దాత్రి శ్రీ 433, కె.కావ్య భాయి 432 మార్కులు సాధించినట్లు చెప్పారు. 460 మార్కులు ఆరుగులు, 400 మార్కులు 10 మంది సాధించినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో బి.వీణనంద్, ఎస్.గీతిక వాణి 980, బైపీసీ విభాగంలో ఈ.సుష్మరాణి 988, సరోజిని మల్లిక 984 మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరిని కళాశాల ఆవరణలో అభినందించారు.

వేర్వేరు కళాశాలల విద్యార్థులు...

తెనాలిఅర్బన్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో తెనాలి పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం మోగించారని విద్యాసంస్థల సీఈవో సిహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎస్.మనస్విని 470 మార్కులు, ఎం.మధువర్షిణి, ఆర్.నందిత సరోజ, పి.సౌమశ్రీ, ఆర్.ప్రసన్న కుమార్‌లు 466 మార్కులు సాధించినట్లు చెప్పారు. బైపీసీ విభాగంలో షేక్ మౌనిషా 432, డి.ఐశ్వర్య, పి.హర్షవర్ధన్, షేక్ రేష్మా 432 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం.సాహిత్‌కుమార్ 988, ఎం.పూజిత 987, బైపీసీ విభాగంలో 986, డి.రిస్పా 984 మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరందరినీ కళాశాల ఆవరణలో శనివారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కె.కృష్ణారెడ్డి, ఎస్.శివన్నారాయణ, టి.కిషోర్, కె.సురేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.లాజర్, తదితరులు పాల్గొన్నారు.


విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులతో చైతన్య విద్యాసంస్థల ఏజీఎం దుర్గాప్రసాద్

కొల్లిపర: స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల స్థాపించిన నాటి నుంచి ఇప్పటివరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్ష ఫలితాలలో 470 మార్కులకు గాను 460 మార్కులు సాధించటం కాలేజీ చరిత్రలోనే ఇదే మొట్టమొదటిసారి అని కాలేజీ సెక్రటరీ అవుతు కృష్ణారెడ్డి కోశాధికారి బొమ్మ రెడ్డి ప్రభాకర్ రెడ్డి శనివారం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదల కావడంతో ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ గ్రూపులో గుదిబండి బసవసింధు అనే విద్యార్థిని 440 మార్కులకు గాను 420 మార్కులు సాధించి ద్వితీయ స్థానం పొందినట్లు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్ విద్యార్థిని కొల్లిపర దీపిక విద్యార్థిని 1000 మార్కులకు గాను 930 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఎస్ఆర్ విద్యాసంస్థల సీఈవో ఉమామహేశ్వరరావు


విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులతో మహితా కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్

క్లుప్తంగా

స్వధార్ హోంలో అనాథకు నిశ్చితార్థం



తెనాలిరూరల్: అనాథలు, వితంతు మహిళలకు ఆశ్రయం ఇచ్చే స్వధార్ హోంలో నివసించే యువతికి హోం నిర్వాహకులు వివాహం నిశ్చయించారు. తెనాలి శివారులోని జేఎంజే స్వధార్ హోంలో ఉంటున్న యువతి సుద్రికి హోం నిర్వాహకురాలు సిస్టర్ హృదయ మేరి వివాహం సంబంధాన్ని కుదిర్చారు. అనాథ అయిన సుద్రికి తేజసాయితో శనివారం నిశ్చితార్థం రిపించారు. అంగలకుదురుకు చెందిన గణేష్ యూత్ నిర్వాహకులు వీరవల్లి మురళి, ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, సభ్యులు హాజరై నూతన దంపతులకు వస్త్రాలను అందజేశారు. గణేష్ యూత్ ఆధ్వర్యంలో మూడో సారి అనాథ యువతికి వివాహం జరిపిస్తున్నట్టు వారు తెలిపారు.

పేద చిన్నారులకు రొట్టెలు, పండ్లు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్యామ్ అండ్ జేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలో పేద చిన్నారులకు శనివారం పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అలెగ్జాండర్ మాణిక్యం మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 150మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు గుంటూరు రిధి, తన్మయ, రోధ, తేజస్విని, ఆర్.సృజనారెడ్డి, తోట అవిలాష్, దొప్పలపూడి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవానిరతి అలవర్చుకోవాలి



తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ సేవానిరతి అలవర్చుకోవాలని శ్రీ ఆంజనేయ ధ్యాన యోగ మండలి నిర్వాహకులు కిషోర్ గురూజీ పిలుపునిచ్చారు. స్థానిక నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. కిషోర్ గురూజీ పాల్గొని ఆశ్రమవాసులకు అల్పాహారం అందజేశారు. అనంతరం ధ్యానంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో దుపుగుంట్ల రమేష్ బాబు, తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, కోమల, సుజాత, రాణి, సుబ్బారావు, సత్యనారాయణ, కూరపాటి నాగరాజు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

మహం కాళీ దేవస్థానంలో చండీ హోమం

దుగ్గిరాల: కంఠరాజు కొండూరులో వేంచేసి ఉన్న శ్రీ మహం కాళీ అమ్మవారి దేవస్థానం నందు శనివారం చైత్ర పౌర్ణమి సందర్భంగా చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. సత్యనాయణ హేమలత దంపతులు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మళ్లీ అఘోరీ వద్దకు శ్రీవర్షిణి

తన గురించి వెతకవద్దని తల్లితండ్రులకు సూచన

మంగళగిరి: పట్టణానికి చెందిన శ్రీవర్షిణి అనే యువతి అఘోరి అలవాల శ్రీనివాసరావుతో పారిపోగా తల్లితండ్రులు పట్టుకుని వెనక్కి తీసుకువచ్చారు. శ్రీ వర్షిణి మళ్లీ శనివారం ఉదయం ఇంటి నుంచి పారిపోయి అఘోరి వద్దకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన గురించి తల్లితండ్రులు పట్టించుకోవద్దని, ముఖ్యంగా విష్ణుకుమార్ తనను వెంటాడడం మానుకోకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించింది. తన జీవితం అంతా అఘోరితోనే అని స్పష్టం చేసింది. శ్రీ వర్షిణి తల్లితండ్రులు శ్రీ వర్షిణి అఘోరి వద్దకు వెళ్లిందని తిరిగి తీసుకువచ్చి తమకు అప్పగించాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనాథాశ్రమంలో అన్నదానం

మంగళగిరి: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు అన్నదానం నిర్వహించారు. శనివారం కుర్రా రాంబాబు ఆధ్వర్యంలో నవులూరు షారోన్ అనాథాశ్రమంలో అనాథ బాలబాలికలకు అన్నదానం చేశారు. మునగాల మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆత్మకూరు నాలుగు కాళ్ల మండపం ఆవరణంలో ఆర్కే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈపూరి ఆదామ్, గుంటి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కాటూరి ఆర్ట్ గ్యాలరీ సందర్శించిన గిన్నిస్ రికార్డర్


ఆర్ట్ గ్యాలరీలో విగ్రహాలను పరిశీలిస్తున్న రాజశేఖరన్ పరమేశ్వరన్

తెనాలి: కేరళ రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ చిత్రకారుడు, రెండు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు విజేత రాజశేఖరన్ పరమేశ్వరన్ శనివారం తెనాలిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. గ్యాలరీలోని వివిధ శిల్పాలను సందర్శించారు. శిల్పులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. వేర్వేరు మెటీరియల్స్‌తో రూపొందించిన వందలాది శిల్పాలను తిలకించిన ఆయన, ఇలాంటి స్థాయి గ్యాలరీలు సాధారణంగా పెద్ద నగరాల్లో మాత్రమే కనిపిస్తాయని, అలాంటి విశిష్ట గ్యాలరీ ఒక చిన్న పట్టణమైన తెనాలిలో ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షను ఆయన అభినందించారు. వీరితో విజయవాడ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి శీలం శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు పార్వతి, సభ్యుడు మహారాణా, సీనియర్ ఆర్టిస్ట్ చల్లా ఉదయశంకర్, వజ్రాల నాగరాజు, తెనాలిలోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, కొండారెడ్డి, ఆలూరు వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా పేరంటాళ్లమ్మ తిరునాళ్లు

వల్లభాపురం(కొల్లిపర): మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని శ్రీ సర్విరెడ్డి పేరంటాలమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణం మహోత్సవం ,పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు గ్రామంలో మూడు రోజులుగా భక్తులు ఘనంగా నిర్వహించారు.తిరునాళ్లను శనివారం ఆకరి రోజు కావటంతో మండలంలోని అనేక గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తమ కుటుంబసభ్యులతో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి కల్యాణ మహోత్సవం, శిడిమాను మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.మహిళలు పెద్ద ఎత్తున పేరంటాళ్లమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.తిరునాళ్లలలో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.కోటేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పిలుపు


సర్టిఫికెట్లు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

తెనాలిటౌన్: మహిళలు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొత్తపేటలోని ఇన్ఫర్మేటిక్స్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోపాలం స్వాతి పాల్గొని 25 మంది మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. మహిళలు కుటుంబ ఉన్నతికి ఆర్థికంగా తోడ్పాడలంటే నేటి సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని తెలియజేశారు. తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవసరమైన సర్టిఫికెట్లు అందించడం అభినందనీయమని సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కటకం వెంకటప్రసాదరావు, వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ప్రభాకరరావు, సునీల్, అచ్యుత సాంబ శివరావు, దీప్తి, రాణి పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి గుండెపాటమ్మ తిరునాళ్ల


అమ్మ వారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామ దేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మ వారి తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునే సుప్రభాత సేవలతో పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. యజమానులు తమ పశువులను అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, చద్ది నైవేద్యాలు సమర్పించా. ఆలయ ఆవరణంలో భక్తులు ప్రభలను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

ఆలోచింప చేసిన అమ్మ చెక్కిన బొమ్మ నాటిక

అబ్బురపరచిన నటీనటులు


అమ్మ చెక్కిన బొమ్మ నాటికలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇక్కడి ఓపెన్ ఆడిటోరియంలో ప్రారంభమైన జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో తొలిగా గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికను ప్రదర్శించారు. విభిన్న ఇతివృత్తంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. సమాజంలో స్త్రీ లేదా పురుషుడు కానివారిని అవమానంచడం, గౌరవించకపోవటం, అసహ్యించుకోవటం మానవ జాతి దిగజారుడుతనానికి ఓ ప్రతీక అనే విషయాన్ని ఈ నాటిక ఎత్తిచూపింది. స్త్రీ, పురుషులే కాకుండా మానవజాతిలో దాదాపు 20 రకాల శరీర తత్వాలు కలిగిన మనుషులు ఉంటారనే విషయాన్ని గుర్తుచేసింది. విభిన్న శరీరతత్వ స్వభావం కలిగిన వారి గురించి పురాణాలు, చరిత్రలు పరిచయం చేస్తూనే వచ్చినా, చందమామపై నివాసం కోసం చూస్తున్న నేటి ఆధునిక సమాజంలో మనుషులు అలాంటి వారికి సముచిత స్థానాన్ని నిరాకరించటంలోని డొల్లతనాన్ని ఈ నాటిక ఎండగట్టింది. ఒక విభిన్న శరీరతత్వపు మనిషి జీవితంలోని కఠిన వాస్తవాలను నాటికలో ప్రదర్శించారు. జ్యోతి రాజ్ భీశెట్టి రచించిన ఈ నాటికను డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో ఆరంభమైన ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

జగనన్న కాలనీ అభివృద్ధికి కమిటీ

రేపల్లె రూరల్: జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కాలనీ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ తెలిపారు. జగనన్న కాలనీలోని దేవుని చెట్టు వద్ద శనివారం కమిటీని ఎన్నుకున్న తర్వాత ఆయన మాట్లాడారు. కనీస వసతులు కల్పించటంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లోని ప్రజలు జగనన్న కాలనీలో స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నట్లు చెప్పారు. కనీస అవసరాలైన తాగునీరు, రహదారులు, డ్రెయిన్‌ల సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. అభివృద్ధి కమిటీ కన్వీనర్‌లుగా వి.ధనమ్మ, కె.రవికుమార్, గౌరవాధ్యక్షుడుగా సీ.హెచ్.మణిలాల్, సహాయ కార్యదర్శులుగా కే.నాంచారమ్మ, అగస్టీన్, షేక్ ఫర్జానా, దుర్గాదేవి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా ఏ.పిచ్చయ్య, కె.వీరాంజనేయులు, కె.వెంకట్రావులు ఎన్నికయ్యారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ బిల్లు

మంగళగిరి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా అమలు చేసిన వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛను హరించే విధంగా ఉందని సీపీఐ నాయకులు విమర్శించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని గౌతమబుద్ధ రోడ్‌లోని పాతబస్టాండ్ వద్ద నుంచి శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వక్ఫ్ సవరణ చట్టం ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు సీపీఐ నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ భూములను కార్పొరేషన్ శక్తులకు కట్టబెట్టేందుకే ఈ చట్టసవరణ బిల్లును మోదీ ప్రభుత్వం ఆమోదించిందని విమర్శించారు. ముస్లిం ప్రజల అభ్యున్నతి కోసం ప్రార్థన మందిరాల కోసం కేటాయించిన లక్షలాది ఎకరాల వక్ఫ్ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే రాజ్యసభలో ఈ బిల్లును ఆమోదింపజేశారని మండిపడ్డారు. దేశంలో మైనార్టీల పరిస్థితి దీనాతిదీనంగా ఉందని జస్టిస్ సత్యానంద్ కమిటీ చెప్పినప్పుడు మైనార్టీలను ఉద్ధరిస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వారి హక్కులను హరిస్తూ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ మహమ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

నిజాంపట్నం: నాటు సారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని దిండి పంచాయతీ జంపనివారిపాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో జంపనివారిపాలెంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. 100 లీటర్ల బెల్లం ఊట, 10 లీటర్ల నాటు సారా లభ్యమైనట్లు చెప్పారు. గ్రామ శివారులోని అడవుల్లో బెల్లం ఊటను ధ్వంసం చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒంగోలు ఎస్ఐలు రామారావు, రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది తదితరులున్నారు.

సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

బాపట్ల: బాపట్ల శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ పి.మోహనరావు తెలిపారు. సీనియర్ ఎంపీసీలో పి.శ్రీపవన్ ఎన్.నాగ అక్షయ, టి.కేతురవ్యాన్సి 989 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో ఎ.లోహిత 986 మార్కులు పొందినట్లు చెప్పారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్ చంద్రశేఖర్, వేణుగోపాల్‌లు అభినందించారు.

15 నుంచి గ్రామ సభలు

కొల్లిపర: మండల పరిధిలోని 20 గ్రామాలల్లో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15న అన్నవరపులంక ,బొమ్మువానిపాలెం, హనుమాన్‌పాలెం, కుంచవరం గ్రామాల్లో ఉదయం 11 గంటలకు, అత్తోట గ్రామంలో సాయంత్రం 4 గంటలకు, 16న అన్నవరం, చక్రాయపాలెం, దావులూరు, దావులూరిపాలెం, కొల్లిపర పిడపర్తిపాలెం, సిరిపురం, తూములూరులో ఉదయం 11గంటలకు, చెముడుపాడు గ్రామంలో మధ్యాహ్నం 2 గంటలకు 17న చివలూరు, మున్నంగి , వల్లభాపురంలో ఉదయం 11 గంటలకు, అత్తలూరిపాలెంలో మధ్యాహ్నం 2గంటలకు. 19న దంతలూరు, పిడపర్రు గ్రామాలల్లో ఉదయం 11గంటలకు ఆయా గ్రామాలల్లో షెడ్యూ ప్రకారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు, గ్రామ సభలకు గ్రామస్థాయి వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్ని గ్రామ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి సభలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విడనాడండి

మంగళగిరి: మత్తు పదార్థాలను విడనాడి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని గుంటూరు ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి వి.అరుణకుమారి విద్యార్థులకు సూచించారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట నిర్మల ఫార్మసీ కళాశాలలో శనివారం మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సరదా కోసం మత్తు పదార్థాలు అలవాటు చేసుకుంటే జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి, తమ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.